క్లుప్తంగా

ఎమ్మెల్యే పల్లాకు ఆహ్వానం



జనగామ: నేడు(ఆదివారం) జిల్లా కేంద్రం ఎస్ ఎంఆర్ గార్డెన్‌లో నిర్వహించనున్న రజక రిజర్వేషన్ సమితి 3వ రాష్ట్ర మహాసభలకు హాజరు కావాలని శనివారం ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ పట్టణ యూత్ అధ్యక్షుడు ఉల్లెంగుల సందీప్, తదితరులు ఉన్నారు.

30న వర్గీకరణపై చర్చా వేదిక

జనగామ: ఎస్సీ వర్గీకరణను వెంటనే చేపట్టాలని మాదిగ, మాదిగ ఉపకులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని విజయ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల30వ తేదీన ఉదయం 10 గంటలకు సభ ఏర్పాటుకు సంబంధించిన చర్చా వేదిక నిర్వహించడం జరుగుతుందని ఐక్య వేదిక ప్రతినిధి ఉడుగుల సాగర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా మాదిగ, మాదిగ ఉపకులాలకు అందాల్సిన రిజర్వేషన్ల విషయంలో అన్యాయం జరుగుతుందన్నారు. దళిత నాయకులు, డాక్టర్లు, ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు, దళిత ఉద్యమ నేతలు, ప్రతి ఒక్కరు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

తాగునీటి నమూనాల సేకరణ



లింగాలఘణపురం: మండల కేంద్రంలో ఇటీవల జరిగిన మరణాల నేపథ్యంలో తాగునీటిలో ఏమైన కలుషితాలు ఉన్నాయోనని పరీక్షించేందుకు శనివారం హనుమకొండ నుంచి కూడా సీనియర్ డాక్టర్ కృష్ణారావు ఆధ్వర్యంలో ప్రజలు తాగేనీటి నమూనాలను తీసుకెళ్లారు. త్వరలో నీటి పరీక్ష ఫలితాలు వచ్చిన అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరిస్తామని స్థానిక వైద్యాధికారి రవితేజ తెలిపారు. వీరితో పాటు సిబ్బంది సాలుద్దీన్, ఏఎన్ఎంలు, ఆశలు ఉన్నారు.

కల్వర్టు పరిశీలన



చిల్పూరు: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని శ్రీపతిపల్లి గ్రామంలో కూలిపోయిన కల్వర్టులు, కొట్టుకుపోయిన రోడ్లను శనివారం పంచాయతీ రాజ్ డీఈ రాజగోపాల్ రావు పరిశీలించారు. రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పంగు రమేశ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి గ్రామ సమస్యలను విన్నవించారు. కడియం ఆదేశాలతో పీఆర్ డీఈ, ఏఈ, సిబ్బంది కూలిపోయిన కల్వర్టులు, కొట్టుక పోయిన రోడ్లను పరిశీలించి కొలతలు తీసుకున్నారు. ఎస్టిమేషన్ వేసి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామన్నారు. పాలబోయిన నరేశ్, మోతె మహేశ్, తుపాకల సాంబరాజు, పిట్టల బాలయ్య, బైరు సత్యనారాయణ, ఆసరి రాజయ్య, పరుష రాములు, శ్రీనివాస్, యాదగిరి, వెంకటయ్య, మోతె ఉపేందర్ ఉన్నారు.

ఎస్సైకి జైలు శిక్ష.. మండలంలో చర్చ

రఘునాథపల్లి: స్థానిక ఎస్సై దూదిమెట్ల నరేశ్‌కు శుక్రవారం జైలు శిక్ష, జరిమానా విధిస్తూ హైకోర్టు తీర్పు ఇవ్వడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. హైకోర్టు ఆదేశాలకు సంబంధించి పత్రికలు, ప్రసార మాధ్యమాల్లో వచ్చిన అంశాలు శనివారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. తరిగొప్పుల ఎస్సైగా పని చేస్తోన్న సమయంలో ధాన్యం అమ్మకాలకు సంబంధించిన వ్యవహారంలో గొలుసు నర్సయ్యపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నిందితుడిగా చేర్చడంపై నర్సయ్య హైకోర్టును ఆశ్రయించాడు. నోటీసులిచ్చి.. చట్ట ప్రకారం దర్యాప్తు చేపట్టాలని 2023 ఫిబ్రవరి 11న న్యాయమూర్తి ఆదేశించారు. ఆ తర్వాత ఆరు రోజులకు నర్సయ్యను ఎస్సై అరెస్ట్ చేశాడు. దీనిని హైకోర్టు తప్పుపట్టింది. న్యాయస్థానం ఆదేశాల ధిక్కరణ కిందకు వస్తుందని.. 41 ఏ నోటీసులు ఇవ్వకుండా ఎలా అరెస్ట్ చేస్తారని ప్రశ్నించింది. ఈ విషయంపై ఎస్సై నరేశ్‌కు వారంరోజులు జైలు, రూ.2 వేల జరిమానా విధించడంతో పాటు, బాధితుడికి రూ.50 వేలు చెల్లించాలని తీర్పునిచ్చింది. అప్పీలుకు అవకాశం కల్పించాలన్న ప్రభుత్వ న్యాయవాది అభ్యర్థన మేర కు తీర్పు అమలును 10 రోజులపాటు నిలిపి వేయడంతో ఈ విషయంలో ఏం జరుగుతుందో అని మండలంలో చర్చకు దారితీసింది.

రతన్‌టాటాకు నివాళి

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్‌టాటా జయంతి కార్యక్రమాన్ని శనివారం శివునిపల్లిలో గంగాజమున హోటల్ వద్ద హోటల్ యజమాని యంజాల ప్రభాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రతన్‌టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాంప్రసాద్, ఎండీ.దస్తగిరి, రాజశేఖర్, ఎం.కిషోర్‌కుమార్, కృష్ణమూర్తి, రమేష్ పాల్గొన్నారు.

పాడిపై యువత ఆసక్తి

- మండలంలో పెరుగుతున్న డెయిరీ ఫాంలు
- రోజుకు 7,382 లీటర్ల పాల ఉత్పత్తి
- గుమ్మడవెల్లిలో 20 నుంచి 200 లీటర్లు



గుమ్మడవెల్లిలో సంగి పాపయ్య పాడి ఆవులు

లింగాలఘణపురం: గ్రామీణ ప్రాంతాల్లోని యువత ఉపాధి కోసం పట్టణాలకు వలసలు వెళ్లకుండా వ్యవసాయానుబంధంగా డెయిరీ ఫాంలను ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నారు. మండలంలోని 22 గ్రామాల పరిధిలో 20 పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల నుంచి రోజుకు 7,382 లీటర్ల పాలు ఉత్పత్తి చేసి జనగామ శీతలీకరణ కేంద్రానికి తరలిస్తున్నారు. పాడి రైతులకు తోడుగా బ్యాంకు రుణాలు ఇవ్వడం, పశువైద్యం కూడా అందుబాటులో ఉండడంతో పాడిపై ఆసక్తి చూపుతున్నారు. మండలంలో గ్రామీణ వికాస బ్యాంకు, కెనరా బ్యాంకు, ఎస్‌బీఐ ఆధ్వర్యంలో బ్యాంకు సేవలు అందిస్తున్నాయి. గ్రామీణ వికాస్ బ్యాంకు ఇప్పటి వరకు రూ.42 లక్షలతో సుమారు 24 డెయిరీ యూనిట్లకు రుణాలు అందజేయగా తీసుకున్న లబ్ధిదారులు సకాలంలో తిరిగి చెల్లిస్తున్నారు. ఆవు పాలకు గతంలో 4 శాతం వెన్న ఉంటే ధర లీటరుకు రూ.45లు చెల్లించడంతో ఆవులను ఎక్కువగా కొనుగోలు చేశారు. ప్రస్తుతం కొంత ధర తగ్గించడంతో యువత నిరాశ చెందుతోంది.

పశువైద్యసేవలు..

పాడి రైతుకు తోడుగా పశువైద్యం కూడా అందుబాటులో ఉంది. మండల కేంద్రం, క్లోం, వనపర్తి, నవాబుపేటల్లో నాలుగు పశువైద్యశాలలకు తోడు జీడికల్, నెల్లుట్లలో సబ్‌సెంటర్లు ఉన్నాయి. నలుగురు డాక్టర్లతో పాటు సిబ్బంది, గోపాలమిత్రలు పశువైద్య సేవలు అందిస్తున్నారు.

ఆదర్శంగా గుమ్మడవెల్లి పాల కేంద్రం చైర్మన్

మండలంలోని గుమ్మడవెల్లి పాల కేంద్రం చైర్మన్ సంగి పాపయ్య పాడి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. రెండేళ్ల క్రితం 20 లీటర్ల పాలతో ఉన్న గుమ్మడవెల్లి విజయ డెయిరీ నేడు 200 లీటర్ల పాల సామర్థ్యానికి పెరిగింది. దీనికి ప్రధానంగా చైర్మన్ సంగి పాపయ్య ముందుగా రెండు పాడి గేదెలను కొనుగోలు చేసి మొదట ఇబ్బంది పడినప్పటికి తట్టుకుని ఎదిగి నేడు ఐదు పాడి గేదెలతో నలుగురికి ఆదర్శంగా నిలిచాడు. అతన్ని చూసి మరికొందరు రైతులు పాడి ఆవులను కొనుగోలు చేసి డెయిరీఫాంలను ఏర్పాటు చేసి గుమ్మడవెల్లి పాల కేంద్రానికి 200 లీటర్ల పాలను పోస్తున్నారు.

20 నుంచి 200 లీటర్లకు తీసుకొచ్చాం..



గతంలో గుమ్మడవెల్లి పాల కేంద్రానికి 20 లీటర్లు మాత్రమే వచ్చేది. నేడు 200 లీటర్ల వరకు తీసుకొచ్చాం. ముందుగా ఆవులను కొనుగోలు చేసి పాలు పోశా.. కొంత ఇబ్బంది ఎదురైనా తట్టుకున్నా.. నన్ను చూసి మరికొంత మంది ఆవులను కొనుక్కుని డెయిరీఫాంలను ఏర్పాటు చేసుకున్నారు.

– సంగి పాపయ్య, పాలకేంద్రం చైర్మన్, గుమ్మడవెల్లి

ధర తగ్గించారు..



రోజుకు 30 లీటర్ల పాలు పోస్తున్నా..గతంలో లీటరుకు రూ.45 ఇచ్చేది. ధర తగ్గించి రూ.39 మాత్రమే ఇస్తున్నారు. గతంలో వెన్నశాతం మాత్రమే చూసేది. నేడు ఎస్ఎన్ఎఫ్ కూడా చూస్తూ పాల ధరను తగ్గించారు. ఉపాధి కోసం బ్యాంక్ రుణం తీసుకొని డైరీ ఫాం పెట్టా. ధర పెంచాలి.

– ఆకుల నరేశ్, పాడి రైతు, లింగాలఘణపురం

డెయిరీ ఫాంలకు రుణాలిస్తున్నాం..



గత రెండేళ్లుగా పాల వ్యాపారం పెరిగింది. దీంతో బ్యాంకులు కూడా రుణాలు ఇస్తున్నాయి. గ్రామీణ వికాస బ్యాంకు పరిధిలో ఇప్పటి వరకు రూ.42 లక్షల వరకు డైరీ ఫాంలకు రుణాలు ఇచ్చాం. అందరు సకాలంలో తిరిగి చెల్లిస్తున్నారు.

– సృజనాదేవి, మేనేజర్, గ్రామీణ వికాస్ బ్యాంకు, లింగాలఘణపురం

అందుబాటులో పశువైద్యం



మండలంలో పశువైద్యం పాడి రైతులకు ఎంతో అందుబాటులో ఉంది. నలుగురు పశువైద్యుల తో పాటు ఇతర సిబ్బంది నిత్యం పాడి రైతులకు వైద్య సేవలు అందిస్తున్నారు. గతంలో కంటే ఆవులను కొనుగోలు చేసి డెయిరీఫాంలను ఎక్కువగా ఏర్పాటు చేస్తున్నారు.

– అనిత, పశువైద్యాధికారి, లింగాలఘణపురం

జీపీ కార్మికులను పర్మనెంట్ చేయాలని ధర్నా



జనగామ రూరల్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించి తక్షణమే ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని యూనియన్ జేఏసీ చైర్మన్ బత్తిని వెంకన్న అన్నారు. జీపీ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ పగిడిపల్లి మల్లేశం ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేసి 11వ పీఆర్సీ నిర్ణయించిన రూ.19వేలు వేతనంగా చెల్లించాలన్నారు. జీఓనంబర్ 51ని తొలగించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లాచారి, నారోజు రామచంద్రం, సుదర్శనం పాల్గొన్నారు.

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జీపీ ఉద్యోగులు చేపట్టిన టోకెన్ సమ్మె కొనసాగుతోంది. సమ్మె శనివారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు తేలుకంటి మురళి మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ జీఓ 51ని రద్దు చేసి జీఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. శ్రీనివాస్, ప్రభాకర్, బాబుగౌడ్, నాగయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చిల్పూరు: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని జీపీ ఉద్యోగులు కోరారు. టోకెన్ సమ్మెలో భాగంగా ఎంపీడీఓ బర్మావత్ శంకర్‌నాయక్, ఎంపీఓ మధుసూదన్‌లకు వినతి పత్రాలు అందజేశారు. గూడూరు భాస్కర్, జీడి ఆనందం, గుగులోత్ రతన్‌సింగ్ పాల్గొన్నారు.

ఆలయాల్లో ధనుర్మాస పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు



పూజ చేస్తున్న శ్రీనివాసశర్మ

జనగామ: జిల్లా కేంద్రంలోని హెడ్‌పోస్టాఫీస్ ఏరియా సంతోషిమాత ఆలయంలో ధనుర్మాసం, శనిత్రయోదశి పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి శ్రీనివాసశర్మ మంత్రోచ్చారణ నడుమ ఆంజనేయ స్వామి, నవగ్రహాలకు తైలాభిషేకం, తదితర పూజలు చేసి భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మాణం చేస్తున్న సంతోషిమాత, ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి భక్తులు సహకారం అందించాలని శ్రీనివాసశర్మ కోరారు.

చిల్పూరులో..

చిల్పూరు: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం బుగులు వేంకటేశ్వరస్వామి విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు స్వామివారికి పూజలు చేపట్టారు. ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, చైర్మన్ శ్రీధర్‌రావు, ధర్మకర్తలు ఉన్నారు.

రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్



బూత్ అధ్యక్షులకు ఎన్నిక ప్రతులను అందజేస్తున్న రమేశ్

రఘునాథపల్లి: ఎన్నికల సమయంలో రైతులకు ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీ 50 శాతం మందికి అమలుకు నోచుకోవడం లేదని.. రైతులందరికి రుణమాఫీ వర్తింపజేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఊడ్గుల రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కోమల్లలో బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల వేణుకుమార్ అధ్యక్షతన జరిగిన బూత్ కమిటీ ఎన్నికల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరు గ్యారెంటీల పేర అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏడాది గడిచినా ఏ ఒక్క హామీ సక్రమంగా అమలుకు నోచుకోవడంలేదన్నారు. అనంతరం 188వ బూత్ అధ్యక్షుడిగా బాల్నె వెంకటయ్య, 189వ బూత్ అధ్యక్షుడిగా వల్లాల శ్రీనివాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన బూత్ అధ్యక్షులకు ఎన్నిక ధ్రువపత్రాలు అందజేశారు. జిల్లా కార్యదర్శి మంద వెంకటేశంయాదవ్, సీనియర్ నాయకులు వల్లాల ఉపేందర్, మాజీ సర్పంచ్ బండి యాదగిరిగౌడ్, మంద రాములు, మహిపాల్‌రెడ్డి, నరేష్, రవి, చందర్‌యాదవ్ పాల్గొన్నారు.

గర్భాలయ గడప ప్రతిష్ఠాపన



గడప ప్రతిష్ఠాపన పూజలో భక్తులు

నర్మెట: కాకతీయుల కాలంనాటి అతిపురాతన శివాలయం శిథిలావస్థకు చేరుకోగా గంగం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు సుమారు రూ. 75 లక్షల అంచనావ్యయంతో పునరుద్దరణ పనులు చేపట్టారు. కాగా, శనివారం గర్భాలయానికి పురోహితులు ప్రయాగ నాగభూషణ శర్మ, పార్నంది శ్రీనివాస్ శర్మ, సతీష్ శర్మలు గడప ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బైరోజు ఉపేందర్ రూ. 41 వేల విలువగల దర్వాజలు, కిటికీలు, తలుపులు, వెంటిలేటర్లు, వజినేపల్లి ఉషారాణి వేణుగోపాల్ గుప్తా రూ.21,116, కన్నె బోయిన ఉపేంద్ర రామకృష్ణ రూ.10,116, , గొడుగు మంజుల రవి రూ.5,016, మారబోయిన విజయ బుచ్చయ్య రూ. 5,016 ఆలయ అభివృద్ధికి అందజేశారు. అనంతరం అన్నదాన వితరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కొండ బాలయ్య, జంగిటి అంజయ్య, జోగిపర్తి ఉపేందర్, రంగరాజు వెంకట రమణారావు, చల్ల మల్లయ్య, గంగం పాపిరెడ్డి, దన్నారపు వెంకట్‌రెడ్డి, బత్తుల కరుణాకర్, చిర్ర వెంకట్‌రెడ్డి, ప్రజ్ఞాపురం శ్రీధర్, కల్లూరి గణేష్, దేవుల పల్లి రాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చౌడవరపు సోమరాజ్యం, శ్రీను, శిద్దు, ఎక్కలదేవి పాండురంగం, యెలగొండ రవి, దన్నారపు మురళి, బోయిని లింగం, మహేశ్వరం మురళి, రామకృష్ణ, రాధాకృష్ణ, గుర్రాల రాములు, బొడ్డు సుధాకర్, బెడదం సుధాకర్ దంపతులు, హనుమాన్ భక్తజన మండలి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామానికి వైకుంఠ రథం అందజేత



వైకుంఠ రథాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

పాలకుర్తి: మండలంలోని ఈరవెన్ను గ్రామానికి దాత మహేశ్వర్‌రెడ్డి..తండ్రి లక్ష్మీనర్సింహారెడ్డి స్మారకార్థం వైకుంఠ రథాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా లావణ్య మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామస్తులు వైకుంఠ రథాన్ని వినియోగించుకోవాలని అన్నారు. ఇదివరకు గ్రామంలో సీసీ కెమెరాలు, బతుకమ్మ విగ్రహం, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుమారస్వామి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, బిర్రు సోమేశ్వర్, సింగిరెడ్డి, సత్తి రెడ్డి, సోమన్న, అశోక్ రెడ్డి, గోనె మహేందర్ రెడ్డి, కూస భాస్కర్ రెడ్డి, భార్గవ్ పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

జనగామ రూరల్: ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల గడువు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నర్సయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను కామర్స్–1, పొలిటికల్ సైన్స్ –1 చొప్పు న పోస్టులు ఖాళీలున్నాయన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత పీజీ కోర్సులలో 55 శాతం మార్కులతో పాసై ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం ఉండాలన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జనవరి 2వ తేదీన ఉదయం 11:00గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

కంచనపల్లి యువకుడికి డాక్టరేట్



రఘునాథపల్లి: రాజస్థాన్ రాష్ట్రంలోని మేవార్ విశ్వ విద్యాలయంలో రసాయన శాస్త్రంలో పీహెచ్‌డీ పూర్తి చేసిన మండలంలోని కంచనపల్లి శివారు దోనబండకు చెందిన లడె కొమురయ్య –మోతమ్మ దంపతుల కుమారుడు సోమాజి డాక్టరేట్ పొందాడు. విశ్వవిద్యాలయం చైర్‌పర్సన్ డాక్టర్ అశోక్‌కుమార్‌గాడియ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. డాక్టరేట్ పొందిన సోమాజిని గ్రామస్తులు అభినందించారు.

అంగన్‌వాడీలో ప్రీస్కూల్ డే



స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలోని 6వ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ మునిగాల రాణి ఆధ్వర్యంలో శనివారం ఈసీసీఈ(ప్రీస్కూల్)డేను నిర్వహించారు. అంగన్‌వాడీ సెంటర్‌లో అక్షరాభ్యాసంతో పాటు ఆటలపోటీలను నిర్వహించి గెలుపొందిన పిల్లలకు బహుమతులు అందించారు. అనంతరం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. ఘన్‌పూర్ జీపీ జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, గోనెల చందు, రాజు, రాములు తదితరులు పాల్గొన్నారు. అలాగే నమిలిగొండ అంగన్‌వాడీ సెంటర్‌లో టీచర్ బొమ్మెర రజిత ఆధ్వర్యంలో ఈసీసీఈ డేను నిర్వహించారు. ఆయా భాగ్య, పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: దేశ ఆర్థిక వ్యవస్థను గొప్పగా తీర్చిదిద్దిన ఆర్థికవేత్త, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న అవార్డు అందించాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి ఎమ్మెల్యే కడియం పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నీతి, నిజాయితీకి మారుపేరుగా మన్మోహన్‌సింగ్ నిలిచారని, సమాచార హక్కు చట్టం, విద్యాహక్కుచట్టం, ఈజీఎస్ పథకం తదితర అనేక సంస్కరణలు చేపట్టిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సీహెచ్.నరేందర్‌రెడ్డి, జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, మారుడోజు రాంబాబు, బెలిదె వెంకన్న, బూర్ల శంకర్, కొలిపాక సతీష్, సింగపురం వెంకటయ్య, చింత ఎల్లయ్య, మంతెన ఇంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి, నీల శ్రీధర్, అన్నెపు ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

పనులు పారదర్శకంగా నిర్వహించాలి

సామాజిక తనిఖీ ప్రజావేదికలో అదనపు డీఆర్డీఓ చంద్రశేఖర్



మాట్లాడుతున్న అదనపు డీఆర్డీఓ చంద్రశేఖర్

రఘునాథపల్లి: ఉపాధి పథకంలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, పనులు పారదర్శకంగా నిర్వహించాలని అదనపు డీఆర్డీఓ చంద్రశేఖర్ అన్నారు. ఉపాధి పనులపై మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం జరిగిన ఓపెన్ ఫోరంలో మండలంలోని 36 గ్రామాల తనిఖీ నివేదికలను డీఆర్‌పీలు వెల్లడించారు. మండలంలో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు నిర్వహించిన 848 పనుల్లో రూ. 6,79,27,748 ఖర్చు కాగా కొన్ని పనుల్లో అక్రమాలు జరిగినట్లు సామాజిక తనిఖీల్లో వెల్లడైంది. ఈ సందర్భంగా అడిషనల్ డీఆర్డీఓ మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి కూలీలకు పనులు కల్పించడంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు అలసత్వం వహించరాదని, ప్రతి కూలీకి పనులు కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వై.రాజేందర్‌రెడ్డి, ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు, విజిలెన్స్ అసిస్టెంట్ మేనేజర్ జి.సంధ్య, సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పీ మౌనిక, అబుడ్స్‌పర్సన్ జి.రాజు డీఆర్‌పీలు నాగేంద్రప్రసాద్, ప్రభాకర్, మహిపాల్, వీఆర్‌బీలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం

ఏబీవీపీ జిల్లా కన్వీనర్ తోట హృతిక్ సాయి



మాట్లాడుతున్న హృతిక్ సాయి

జనగామ రూరల్: ఏళ్ల తరబడి స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా విద్యారంగ సమస్యలు గాలికి వదిలేశారని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ తోట హృతిక్ సాయి అన్నారు. శనివారం జిల్లా శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే విద్యారంగంపై ప్రభుత్వ తీరును మార్చుకొని విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉమర్, కార్తీక్, సాయి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

యాకూబ్ మృతి తీరనిలోటు

స్టేషన్‌ఘన్‌పూర్: ఎమ్మార్పీఎస్, మాదిగ దండోరా ఉద్యమ సీనియర్‌నాయకుడు దైద యాకూబ్ మృతి ఉద్యమాలకు తీరనిలోటని మాజీ జెడ్పీ స్టాండింగ్‌కమిటీ చైర్మన్, స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ మారపాక రవి అన్నారు. మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన యాకూబ్ అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. కాగా, యాకూబ్ మృతదేహాన్ని రవి సందర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. అంతిమయాత్రలో పాల్గొని నివాళులర్పించారు. కనకం గణేష్, లక్కాకుల జగన్, దైద ఎలిషన్, గుండె మల్లేష్, డాక్టర్ కుమార్ ఉన్నారు.

నేడు ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడి ఎన్నిక

జఫర్‌గఢ్: స్థానిక ఆర్యవైశ్య భవనంలో నేడు (ఆదివారం) ఉదయం 10 గంటల నుంచి ఆర్యవైశ్య సంఘం మండల నూతన అధ్యక్షుడి ఎన్నికను నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు గంగిశెట్టి ప్రమోద్ కుమార్, సంఘం మండల అధ్యక్షుడు రేపూరి రమేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఎన్నికకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందన్నారు. మండలానికి చెందిన ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

టీఎస్ యూటీఎఫ్ మహాసభలకు తరలిన నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: నల్గొండ జిల్లా కేంద్రంలో శనివారం నుంచి ప్రారంభమైన తెలంగాణరాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలకు ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రం నుంచి సంఘం నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాశ్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయుల సంక్షేమానికి, విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం టీఎస్‌యూటీఎఫ్ అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. శ్రీనివాస్, వసంత్‌నాయక్, వెంకటేశ్వర్లు, నీలకంఠం, సుధాకర్ తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన కొల్లిపాక తిరుమలేష్ అనారోగ్యంతో జనగామలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా, శనివారం సామాజిక సేవాకర్త కోడూరి శివకుమార్ గౌడ్ ఆయనను పరామర్శించి రూ. 5వేల సాయం అందజేసి మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట చెవిటి శ్రీకాంత్, బింగి భరత్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి..

దేవరుప్పుల: మండల కేంద్రంలో చిలువేరు కొండయ్య మృతి చెందాడు. కాగా, విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు శనివారం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

ఇంటింటా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

దేవరుప్పుల: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇంటింటి సర్వే శనివారం కొనసాగింది. మండల పరిషత్ అనుబంధ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఇంటింటా తిరుగుతూ నిర్దేశిత యాప్‌లో లబ్ధిదారుల ఫొటో తీసి ఇల్లు అద్దె లేదా సొంతం అనేది గుర్తిస్తూ అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ఆరు గ్యారంటీలతోపాటు పలు సంక్షేమ పథకాల కోసం ప్రజాపాలన దరఖాస్తుల ఫార్మెట్‌లో మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 10,906 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్దేశిత సమయంలో పారదర్శకంగా సర్వే చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.